క్లుప్తంగా

ముగిసిన ఇంటర్ పరీక్షలు

తోటపల్లిగూడూరు: తోటపల్లిగూడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ కేంద్రంలో స్థానిక కళాశాలతో పాటు కోడూరు గురుకుల బాలికల కళాశాల, ఇందుకూరుపేటలోని వశిష్ట జూనియర్ కళాశాల, ఇందుకూరుపేట, నరసాపురం ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న ప్రత్యేక కళాశాలలకు చెందిన 290 మంది విద్యార్థులు ఎగ్జామ్స్ రాశారు. సమస్యాత్మక కేంద్రం కావడంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఎస్సై వీరేంద్రబాబు పటిష్ట పోలీస్ బందోబస్తును పెట్టారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ప్రిన్సిపల్ ధనంజయరావు తెలిపారు.

బకాయిలు చెల్లించాలి

పొదలకూరు: మండలంలో పంచాయతీలు మత్స్యశాఖకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే జమ చేయాలని ఆ శాఖ ఫీల్డ్ ఆఫీసర్ రూపకళ పేర్కొన్నారు. శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి హాజరైన ఆమె మాట్లాడుతూ మత్స్యశాఖకు అల్లూర్తి, తాటిపర్తి, తోడేరు, ఇనుకుర్తి, డేగపూడి నుంచి మొత్తం రూ.1.46 లక్షలు చెల్లించాల్సి ఉందన్నారు. పాత ఫసలి సంవత్సరాలకు సంబంధించి బకాయిలు చెల్లిస్తేనే కొత్త ఫసలి సంవత్సరం బకాయిల చెల్లింపులు ఆన్‌లైన్‌లో తీసుకుంటుందన్నారు. అయితే సర్పంచ్‌లు పాత ఫసలి సంవత్సరాల బకాయిలు మాఫీ కావాలంటే అప్పట్లో చెరువుల్లోకి నీరు చేరలేదని రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ ద్వారా సర్టిఫికెట్లు సమర్పించాల్సి ఉంటుందన్నారు. పంచాయతీ సెక్రటరీలు చొరవ తీసుకోవాలన్నారు.

డిగ్రీ పరీక్షలకు 34 మంది గైర్హాజరు

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాలల్లో శనివారం నిర్వహించిన డిగ్రీ నాలుగో సెమిస్టర్ పరీక్షలకు 34 మంది గైర్హాజరయ్యారని ఎగ్జామ్స్ నిర్వహణాధికారి డాక్టర్ ఆర్.మధుమతి తెలిపారు. ఉదయం జరిగిన ఆరో సెమిస్టర్ పరీక్షలకు అందరూ హాజరయ్యారని వెల్లడించారు. మధ్యాహ్నం నిర్వహించిన నాలుగో సెమిస్టర్ పరీక్షలకు 258 మందికి గానూ 224 మంది హాజరై.. 34 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

చీరల పంపిణీ



కొడవలూరు: స్థానిక శ్రీధరస్వామి ఆలయంలో హరిహర పుత్ర మణికంఠ సేవా సమాజం ఆధ్వర్యంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్కాకుల హర్షవర్ధన్ దాతృత్వంతో పేదలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం అన్న సంతర్పణ జరిగింది. గురుస్వాములు కుప్పాల నాగేశ్వరరావు, మన్నెం సుబ్బారావు, నేతాజీ అభ్యుదయ సేవా సమితి అధ్యక్షుడు కోవూరు వెంకీ, స్థానిక నాయకుడు పి.శ్రీనివాసులు, నక్కా రమణయ్య పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి అందజేత



కొడవలూరు : మండలంలోని యల్లాయపాళెం జెడ్పీ హైస్కూల్‌లో 55 మంది పదో తరగతి విద్యార్థులకు ఎస్బీఐ నార్తురాజుపాళెం శాఖ ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రిని అందజేశారు. వీటిని బ్యాంక్ మేనేజర్ బాబు ప్రసాద్ చేతుల మీదుగా శనివారం అందించారు. పాఠశాల హెచ్‌ఎం ఎ.మోహన రామలింగయ్య, ఉపాధ్యాయులు ఎస్.తిరుమలయ్య, విజయబాబు పాల్గొన్నారు.

పనుల పరిశీలన



బుచ్చిరెడ్డిపాళెం: గ్రామాల్లోని చెత్త ద్వారా ప్రతి పంచాయతీ ఆర్థిక పరిపుష్టి సాధించవచ్చని జెడ్పీ సీఈఓ విద్యారమ అన్నారు. రేబాల గ్రామంలో శనివారం జరిగిన 'స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో ఆమె పాల్గొని, పలు పనులను పరిశీలించారు. పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీపీ మన్నేపల్లి శ్రీనివాసులు, ఎంపీడీఓ శ్రీహరి, పంచాయతీ విస్తరణాధికారి నారాయణరెడ్డి పాల్గొన్నారు.

పనిభారం తగ్గించాలని వినతి



విడవలూరు: తమపై పనిభారం తగ్గించాలని మండలంలోని పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీఓ నగేష్‌కుమారికి తన కార్యాలయంలో శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ సచివాలయంలోని వివిధ బాధ్యతలతోపాటు, పలు సర్వేల వల్ల తమపై పనిభారం పెరుగుతోందన్నారు. దీనివల్ల ఒత్తిడికి లోనవుతున్నట్లు తెలిపారు.

దళారులు దోచేస్తున్నారు

రైతులను దళారులు దోచేస్తున్నారు. ఆరుగాలం కష్టించి పండించిన పంటను అమ్ముకుందామంటే సరైన ధరల్లేక అన్నదాతలు ఆందోళనలో ఉన్నారు. గతేడాది వరి కోతలు ప్రారంభ సమయంలోనే పుట్టి ధర రూ.25 వేలకు పైగా అమ్మిన జిలకర మసూరి (బీపీటీ) రకం ప్రస్తుతం రూ.17 వేలకు పడిపోయింది. మిల్లర్లు, డీలర్లు కుమ్మక్కై మోసం చేస్తున్నారని రైతులు ఆందోళన చెందుతున్నారు.

- నాణ్యత పేరుతో దోపిడీ
- గతేడాదితో పోలిస్తే పడిపోయిన ధరలు
- పట్టించుకోని అధికారులు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు



తిక్కవరప్పాడులో వరికోతలు

వెంకటాచలం: మండలంలో సర్వేపల్లి రిజర్వాయర్, కనుపూరు కెనాల్ ఆయకట్టు కింద ఈ ఏడాది సుమారు 50 వేల ఎకరాలకుపైగా వరిసాగు చేపట్టారు. 50 శాతానికి పైగా బీపీటీ 5204, మిగతా 50 శాతం ఆర్‌ఎన్‌ఆర్ 15048, కేఎన్‌ఎం 1638 తదితర రకాలను సాగు చేశారు. ప్రస్తుతం తిక్కవరప్పాడు, గొలగమూడి, కంటేపల్లి, కాకుటూరు, కనుపూరు, కసుమూరు, పాలిచెర్లపాడు, చవటపాళెం తదితర గ్రామాల్లో వరికోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. బీపీటీ రకం సాగు చేపట్టిన రైతులకు ఈ ఏడాది పెట్టుబడులు బాగా పెరిగాయి. దుక్కి నుంచి ధరల భారం పడి ఎకరాకు రూ.25 వేల నుంచి రూ.30 వేలకుపైగా పెట్టుబడి పెట్టారు. ప్రస్తుతం బీపీటీ పుట్టి ధర కొన్ని మండలాల్లో రూ.18,500 నుంచి రూ.19 వేల వరకు మిల్లర్లు, వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. వెంకటాచలం మండలంలో మాత్రం దళారులు, మిల్లర్లు కమ్మక్కై బీపీటీ రకాన్ని రూ.17 వేల నుంచి రూ.18 వేల మధ్యలో కొంటున్నారు.



ధాన్యాన్ని బస్తాల్లో నింపుతూ..

నాణ్యత పేరుతో..

పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత సంవత్సరంతో పోలిస్తే ధాన్యం ధరలు పతనమైన పరిస్థితులున్నాయి. దళారులు నాణ్యత పేరుతో ఉన్న ధరల్లోనూ కోతలు పెడుతున్నారు. సరుకు పచ్చిగా ఉందని చెబుతూ పుట్టికి రూ.500 నుంచి రూ.1,000 వరకు తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. ధాన్యాన్ని ఆరబెట్టి నివాసాల్లో నిల్వ ఉంచుకునే వెసులుబాటు లేకపోవడంతో రైతులు దళారులు అడిగిన ధరకు ఇచ్చేయాల్సి వస్తోంది. పౌరసరఫరాల శాఖ అధికారులు గ్రామాల్లో తనిఖీలు నిర్వహించకపోవడంతో దళారులు అమాయక రైతులను మోసం చేస్తున్నారు. ప్రభుత్వ కేంద్రాల్లో ఎక్కడా ధాన్యం కొనుగోలు చేయడంలేదు. ప్రచార ఆర్భాటానికి తప్ప వీటితో ఎలాంటి ప్రయోజనం లేదని అన్నదాతలు వాపోతున్నారు. జిల్లా అధికారులు స్పందించి దళారుల దోపిడీని అడ్డుకోవాల్సి ఉంది.

రైతులకు నష్టం



వరిసాగు చేపట్టిన రైతులకు ఈ ఏడాది పెట్టుబడులు కూడా చేతికొచ్చే పరిస్థితి కనిపించడం లేదు. తెగుళ్ల ప్రభావంతో పెట్టుబడులు పెరిగాయి. ధాన్యం ధరలు గతేడాదితో పోలిస్తే పుట్టి ధర రూ.5 వేలకుపైగా తగ్గిపోయింది. అధికారులు జోక్యం చేసుకోవాలి.

– చిట్టమూరు శివకుమార్‌రెడ్డి, ఇస్కపాళెం

గిట్టుబాటు ధర కల్పించాలి

రైతులు పండించిన పంటకు సరైన గిట్టుబాటు ధర లభించడం లేదు. వరిసాగులో ఈ ఏడాది పెట్టుబడులు పెరిగిపోయాయి. కానీ ధాన్యం పుట్టి ధర పూర్తిగా పడిపోవడం, నాణ్యత పేరుతో ధరలు ఇంకా తగ్గించడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అధికారులు జోక్యం చేసుకుని న్యాయం చేయాలి.

– ప్రసాద్, పాలిచెర్లపాడు

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు

తోటపల్లిగూడూరు: ఈనెల 17వ తేదీ నుంచి జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఆయన శనివారం వివరాలు వెల్లడించారు. మండలంలోని చిన్నచెరుకూరు, తోటపల్లిగూడూరు, చెన్నపల్లిపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ మూడు సెంటర్లలో 463 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతారని తెలిపారు.

280 మంది విద్యార్థులు



పరీక్షల నిర్వహణపై చర్చిస్తున్న అధికారులు

మనుబోలు: మండలంలోని వివిధ గ్రామాల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు మనుబోలు మండల కేంద్రంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. రెండు కేంద్రాలకు చీఫ్ ఎగ్జామినర్లుగా కాంతారావు, శ్రీనివాసులు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లుగా వాసుదేవకుమార్, శ్రీహరిని నియమించారు. వారితో కలిసి ఏర్పాట్లను ఎంఈఓ రమేష్‌కుమార్ శనివారం పరిశీలించారు. మొత్తం 280 మంది పరీక్షలకు హాజరవుతారని అధికారులు తెలిపారు.

ప్లాస్టిక్ కవర్లు వాడితే జరిమానా

మనుబోలు: దుకాణదారులు ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే జరిమానా విధిస్తామని ఎంపీడీఓ జలజాక్షి హెచ్చరించారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రలో భాగంగా శనివారం మనుబోలు మండల కేంద్రంలో సర్పంచ్ కంచి పద్మమ్మ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం సర్పంచ్‌తో కలిసి దుకాణాల వద్దకు వెళ్లి ప్లాస్టిక్ కవర్లు వాడొద్దని సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ వెంకటేశ్వర్లు, కార్యదర్శి గరుడయ్య, వార్డు మెంబర్ భాస్కర్‌రెడ్డి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

- **పొదలకూరు:** పట్టణంలో శనివారం స్వచ్ఛాంధ్ర – స్వచ్ఛ దివస్ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక రామనగర్ గేటు సెంటర్ నుంచి ఎంపీడీఓ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగింది. ఎంపీడీఓ సాయిప్రసాద్ మాట్లాడుతూ ప్రతి మూడో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసులు, స్థానిక నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.
- **కొడవలూరు:** ప్లాస్టిక్ సంచుల వాడకంతో అనర్థమని డీపీఓ ఎల్.శ్రీధర్‌రెడ్డి సూచించారు. మండలంలోని రేగడిచెలికలో సర్పంచ్ నల్లావుల శ్రీనివాసులు ఆధ్వర్యంలో 'స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర' కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలుచని ప్లాస్టిక్ సంచుల వాడకంతో కేన్సర్ లాంటి ప్రమాదకర వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. డీపీఓ పి.సత్యవాణి మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. అనంతరం జ్యూట్ బ్యాగ్‌లను పంపిణీ చేశారు. డీఎల్‌పీఓలు రమణయ్య, పద్మజ, ఎంపీడీఓ సుబ్బారావు, ఎంఈఓ జి.వసంతకుమారి, ఏఓ లక్ష్మి, స్థానిక నాయకులు చెముకుల వెంకయ్య, భాస్కర్ పాల్గొన్నారు.
- స్థానిక దిన్నె అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. హెచ్‌ఎం మోహన్‌రావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.నాగభూషణమ్మ, ఉపాధ్యాయిని జె.సుజాత, అంగన్‌వాడీ కార్యకర్తలు వై.రాజమ్మ, ఎస్.సుదర్శన, సహాయకులు ఎస్.వరలక్ష్మి, టి.ప్రసన్న పాల్గొన్నారు.
- **బుచ్చిరెడ్డిపాళెం:** బుచ్చి పట్టణంలో 'స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర' కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ ర్యాలీ చేశారు. అనంతరం చైర్‌పర్సన్ సుప్రజ పలు సూచనలు చేశారు. కమిషనర్ బాలకృష్ణ, కౌన్సిలర్లు మల్లారెడ్డి, తాళ్ల వైష్ణవి, కోటంరెడ్డి లలితమ్మ, కత్తి శ్రీదేవి, ఏఈ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.
- **ఇందుకూరుపేట:** మండలంలోని కొత్తూరులో 'స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర' కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ నాగేంద్రబాబు పలు సూచనలు చేశారు. తొలుత ప్రతిజ్ఞ చేసి, ర్యాలీ నిర్వహించారు.



ఇందుకూరుపేట : కొత్తూరులో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు



మనుబోలు : దుకాణదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ, సర్పంచ్



కొడవలూరు: నార్తురాజుపాళెంలో చేతుల శుభ్రతపై అవగాహన



బుచ్చిరెడ్డిపాళెంలో ర్యాలీ



కొడవలూరు: రేగడిచెలికలో..

కల్యాణం.. కమనీయం

పొదలకూరు: పట్టణంలోని శ్రీలేఅవుట్ శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో భాగవత సప్తాహం చివరిరోజున శనివారం రుక్మిణి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. త్రిదండి అహోబిల రామాంజనేయ జీయర్‌స్వామి చేతుల మీదుగా కనులపండువగా కల్యాణం జరిగింది. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. దేవస్థానం నిర్వాహకులు అన్నప్రసాదాలను ఏర్పాటు చేశారు. ఏడురోజుల పాటు నిర్వహించిన భాగవత సప్తాహం చివరిరోజున వాసుదేవ మంత్ర ప్రయుక్త హవనము మహా పూర్ణాహుతి నిర్వహించారు.



కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న జీయర్‌స్వామి

పలువురికి ప్రసన్న పరామర్శ



జనార్ధన్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ప్రసన్నకుమార్‌రెడ్డి



వెంకటరమణయ్య కుటుంబ సభ్యులతో ప్రసన్న

విడవలూరు: మండలంలోని అలగానిపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చేబ్రోలు జనార్ధన్ కుమారుడు శ్రవంత్‌కుమార్ ఇటీవల ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ క్రమంలో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి శనివారం వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు.

- అలగానిపాడులో వైఎస్సార్‌సీపీ నాయకుడు కొబ్బర్తి వెంకటరమణయ్య సోదరుడు మోహన్ శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందారు. ఈ సందర్భంగా ప్రసన్న శనివారం వారి గృహానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు పూండ్ల అచ్యుత్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌రెడ్డి, పార్టీ నాయకులు గండవరపు వివేకానందరెడ్డి, శీలు రవి, సుధాకర్ తదితరులున్నారు.

ఈఓపీఆర్డీపై విచారణ జరపాలి

కోవూరు: కోవూరు ఈఓపీఆర్డీపై సమగ్ర విచారణ జరపాలని డీఏఏబీ మాజీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి అన్నారు. కోవూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. నాలుగు రోజులుగా కోవూరు ఈఓపీఆర్డీ శ్రీనివాస్‌పై ప్రధాన దినపత్రికల్లో కథనాలు వస్తున్నా ఉన్నతాధికారులు విచారణ చేయకపోవడం అనుమానాలకు దారి తీస్తున్నాయన్నారు. ఈఓపీఆర్డీ శ్రీనివాస్ తనిఖీల పేరిట లక్షలాది రూపాయలు వసూలు చేయడం సర్వసాధారణంగా మారిందన్నారు. కోవూరు ఈఓపీఆర్డీతోపాటు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులును సరెండర్ చేసుకుని లేదా సస్పెండ్ చేసి విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. ఇటీవల డీపీఓ వ్యక్తిగత పర్యటనకు శ్రీలంక వెళ్లినప్పుడు తన వాటా కింద రూ.2 లక్షలు ఇచ్చినట్లు ఈఓపీఆర్డీ పలువురి దగ్గర చెప్పినట్లు సమాచారం ఉందన్నారు. పార్టీ మండల కన్వీనర్ అత్తిపల్లి అనూప్‌రెడ్డి మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకర్‌రావు పేరుతో తప్పుడు లెటర్లు పంపి ఆరోపణలు ఎదుర్కొంటున్న కోవూరు ఈఓపీఆర్డీ, పంచాయతీ కార్యదర్శిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. వారు నిబంధనలకు విరుద్ధంగా రికార్డులు సృష్టిస్తున్నారన్నారు. శనివారం జరిగిన సమావేశానికి కూడా తొమ్మిది మంది వార్డు సభ్యులకు సమాచారం ఇవ్వలేదన్నారు. టెండర్ల విషయంలో కూడా పలు అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నప్పటికీ చర్యలు లేవన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, వైస్ ఎంపీపీ నరసింహులురెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు వేణు, వార్డు సభ్యులు శ్రీనివాసులు, సుప్రజ, రేణుకమ్మ, కల్యాణి, నాగలక్ష్మి, సుశీల, వజ్రమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీటీసీ సభ్యులు

- అధికారుల గైర్హాజరుపై సభ్యుల ఆగ్రహం

పొదలకూరు: మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ కె.సుబ్బరాయుడు అధ్యక్షతన శనివారం వాడీవేడిగా జరిగింది. ఎంపీడీఓ ఎం.సాయిప్రసాద్, వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి మండల స్థాయి అధికారుల పనితీరు, ఆయా శాఖల్లో జరుగుతున్న పనులను సమీక్షించారు. కొందరు అధికారులు సమావేశానికి హాజరు కాకపోవడంపై ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. సాధారణ సమావేశం మూడునెలలకోసారి జరుగుతుందని ఇలాంటి ముఖ్యమైన సమావేశానికి అధికారులు హాజరుకాకుండా కింది స్థాయి ఉద్యోగులను పంపడంపై మండిపడ్డారు. కీలకమైన రెవెన్యూ శాఖ గైర్హాజరుపై ఎంపీటీసీలు అసహనం వ్యక్తం చేశారు. జిల్లాలో ఏ మండలంలోనూ ఇలాంటి పరిస్థితి ఉండదని హాజరుకాని అధికారులకు నోటీసులను పంపిస్తామని ఎంపీడీఓ తెలిపారు.

నిలదీత

బిరదవోలు ఎంపీటీసీ సభ్యుడు రావుల దశరథరామయ్యగౌడ్ మాట్లాడుతూ చాటగొట్ల – బిరదవోలు మార్గంలో స్తంభాలు తోలి ఏడాది గడుస్తున్నా వాటిని నిర్మించి విద్యుత్ సౌకర్యం కల్పించకపోవడంపై ఏఈ శ్రీకాంత్‌ను నిలదీశారు. ఎప్పటిలోగా పూర్తి చేస్తారని ప్రశ్నించారు. పొదలకూరు బిట్ – 4 ఎంపీటీసీ సభ్యుడు గుంటి శ్రీనివాసులు మాట్లాడుతూ సభ్యులకు సంతృప్తికర స్థాయిలో సమాధానం చెప్పాలంటే అధికారులు పూర్తిస్థాయిలో హాజరుకావాలన్నారు. దుగ్గుంట ఎంపీటీసీ సభ్యుడు కేతు రామిరెడ్డి గృహ నిర్మాణ శాఖ ఇన్‌చార్జి ఏఈ పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాచార హక్కు చట్టం కింద వివరాలు అడిగి రిసీవ్డ్ కాపీపై సంతకం పెట్టి సీల్ వేయమంటే మూడురోజులు తిప్పుకొన్నట్టు తెలిపారు. ఇలాగేనా పనిచేసేదని దుయ్యబట్టారు. వైస్ ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో మంచినీటి సమస్యలుంటే చెప్పాలన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



కోవూరు: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని సర్పంచ్ ఎడెం లక్ష్మీకుమారి తెలిపారు. మండలంలోని గంగవరం గ్రామంలో జైభీమ్ యూత్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి చెడుగుడు పోటీలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ క్రీడలను ప్రతిఒక్కరూ ఆదరించాలని కోరారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. టీడీపీ నేత శ్రీధర్ నాయుడుతోపాటు జైభీమ్ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని డిమాండ్

కోవూరు: కోవూరు బజారు రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గండవరపు శేషయ్య డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలను పరిష్కరించాలంటూ నేతలు శనివారం కోవూరు మండల కేంద్రం బజార్ సెంటర్లో కరపత్రాలతో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాలుచింతల సెంటర్ నుంచి కోవూరు వరకు డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టాలన్నారు. ప్రజల అభిప్రాయం మేరకు రహదారి నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్థానిక నేతలు షేక్ అఫ్రోజ్, గండవరపు సురేష్, సర్దార్ అహ్మద్, ఉటుకూరు వెంకటరమణయ్య, సుబ్బారావు, చాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలి

- ఘనంగా వైఎస్సార్ టీఏ వార్షికోత్సవం

నెల్లూరు(బారకాసు) : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం దిశగా ఏపీ వైఎస్సార్ టీఏ ఉద్యమించాలని ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ సిటీ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. నగరంలోని రాంజీనగర్‌లో ఉన్న పార్టీ సిటీ కార్యాలయంలో ఏపీ వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ మొదటి వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్సీ పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం మాట్లాడుతూ వైఎస్సార్‌టీఏ ఉత్తమ అసోసియేషన్‌గా కీర్తి గడించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మునీర్‌జాన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సుబ్బారెడ్డి, వాసు, రాష్ట్ర కార్యదర్శి సురేంద్ర, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు శ్రీలత, జిల్లా కార్యదర్శులు వేణుగోపాల్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



అసోసియేషన్ నాయకులతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ పర్వతరెడ్డి